క్లుప్తంగా

పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలి



మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో(కేజీబీవీ) విధులు నిర్వర్తిస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి వేతనాలు తక్షణమే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి కోరారు. నగరంలోని హోచిమన్ భవన్‌లో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ సిబ్బందితో పని చేయించుకుని జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వ శిక్ష అభియాన్ అధికారులను కలెక్టర్ ఆదేశించినా వారి తీరు మారలేదన్నారు. నిధులున్నా నిర్లక్ష్యం వహిస్తూ కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో కెసి.బాదుల్లా, పి.సుబ్బరాయుడు, ఉద్దే మద్దిలేటి, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

సీఐ సత్యనారాయణను సస్పెండ్ చేయాలి

కడప ఎడ్యుకేషన్: డీఎస్సీ అభ్యర్థులపై పోలీసులు ప్రదర్శించిన నిరంకుశ వైఖరి సరికాదని, సీఐ సత్యనారాయణను వెంటనే సస్పెండ్ చేయాలని భారత చైతన్య యువజన పార్టీ కడప జిల్లా నాయకుడు నాగార్జున డిమాండ్ చేశారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ పోలీసుల అరాచక వైఖరిని ఆయన ఖండించారు. వై+సెక్యూరిటీ కలిగిన బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతపై సీఐ హద్దులు దాటి వీధి రౌడీలా ప్రవర్తించడం సరికాదని మండిపడ్డారు. బాధితులకు న్యాయం చేయాలని, ప్రభుత్వానికి నిరుద్యోగులపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వారి డిమాండ్లను నెరవేర్చాలన్నారు.

యోగాతో ఆరోగ్యం



యోగాసనాలు చేయిస్తున్న అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: యోగ చేయడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జ్ఞానేశ్వరి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం కడప పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో అధ్యాపకుడు అమృతరాజు యోగాసనాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ యోగపై విద్యార్థులను చైతన్యం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హబీబుల్లా, రాజారావు, సుధాకర్‌రెడ్డి, శ్రీరాములరెడ్డి, సుజాత, పద్మావతి, రోజమ్మ, చంద్రమౌళి, రామసుబ్బయ్య, యోగీశ్వరరెడ్డి, హరికృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

13 నుంచి ఉచిత యోగ శిక్షణ

కడప ఎడ్యుకేషన్: ఈ నెల 13వ తేదీ నుంచి కడప బాలాజీ నగర్ లోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో ఉచిత యోగ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ప్రెసిడెంట్ అనంతబొట్ల వెంకటసుబ్బయ్య ఓ ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. యోగా నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథ రెడ్డి శిక్షణ ఇస్తారని, ఆసక్తి గల వారు 98855 86825 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రాహుకాల పూజలు

కడప కల్చరల్ : కడప విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం మహిళలు రాహుకాల పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు జరిపి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ నెల 11న శాంతి కల్యాణోత్సవం నిర్వహించనున్నామని తెలిపారు.

8న బండలాగుడు పోటీలు

సిద్దవటం: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ ఎస్‌కేఆర్ నగర్ ఎస్సీ కాలనీలో వెలసిన శ్రీ అంకాలమ్మ తిరునాల సందర్భంగా ఈనెల 8వ తేదీన వృషభాలతో బండలాగుడు పోటీలు ఏర్పాటు చేసినట్లు మంగళవారం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలిచిన ఎద్దుల యజమానులకు మొదటి బహుమతి రూ. 50వేలు, రెండవ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ. 20వేలు, నాల్గవ బహుమతి రూ. 10వేలు అందజేస్తామని తెలిపారు.

రేపు మల్లమ్మ జాతర

వీరబల్లి: మండలంలోని ఓదివీడు కస్పాలో వెలసిన మల్లమ్మ జాతర గురువారం రాత్రి నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహక సభ్యులు తెలిపారు. ఇటీవల అతి పురాతనమైన మల్లమ్మ ఆలయానికి మరమ్మతులు చేశారు. జాతర నిర్వహించాలని పెద్దలు నిర్ణయించారు. శుక్రవారం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు.

నేరేడు పండు....పోషకాలు మెండు!

ప్రకృతి ప్రసాదించే పండ్ల జాతుల్లో నేరేడు పండు ఒకటి. ఆరోగ్య ఫల ప్రధాయినిగా పిలిచే నేరేడు పండును సక్రమంగా వినియోగిస్తే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. శరీరంలో ఏర్పడే కొన్ని అనారోగ్య సమస్యలను దూరం చేస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. నేరేడు పండు రుచి మేటిగా ఉంటుంది. పండుతోపాటు ఆకులు, చెట్టు బెరడు ఆరోగ్యానికి మేలు చేసేవే.

- ఆరోగ్య ఫలదాయినిగా గుర్తింపు
- పుష్కలంగా ప్రొటీన్లు, పీచు పదార్థాలు
- కిలో రూ. 200-400లకు విక్రయం



నేరేడు పండ్లు

నేరేడులో ఆరోగ్యానికి మేలు చేసేవి ఇవే

ప్రొటీన్లు 7 శాతం, ఖనిజాలు 4 శాతం, పీచు పదార్థం 3 మూడు, కొవ్వు 3 శాతం, క్యాల్షియం 15 మి.గ్రా. ఐరన్ 12 మి.గ్రా, విటమిన్-సి 18 మి.గ్రా, పాస్పరస్ 18 మి.గ్రా., పిండి పదార్థం 14 శాతం.

కడప కోటిరెడ్డిసర్కిల్: నేరేడు పండ్లను కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ (మెయిన్), సీఎస్ఐ హైస్కూల్, పాత మార్కెట్, రైతు బజారు, ఆర్టీసీ బస్టాండు, ఎర్రముక్కపల్లె, ఏడురోడ్లు తదితర ప్రాంతాల్లో తోపుడు బండ్లపై వ్యాపారులు వినియోగదారులకు విక్రయిస్తున్నారు. చిన్నవిగా ఉండే నేరెడు కిలో రూ.200, పెద్ద కాయయలైతే రూ. 300-400 వరకు అమ్ముతున్నారు. ధర అధికంగా ఉన్నప్పటికీ వీటి ప్రాధాన్యం గుర్తించిన ప్రజలు కొనుగోలుపై ఆసక్తి కనబరుస్తున్నారు .ఈ పండ్లను కోయడం కొంత కష్టంతో కూడుకున్న పని. అందువల్ల ధర అధికంగానే ఉంటుంది. రైతుల నుంచి దళారులు రూ. 80-90కు కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది. దళారులు వ్యాపారులకు రూ. 130-150కు విక్రయిస్తున్నారు. సంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానపరంగా ఔషధ లక్షణాలు కలిగి ఉన్న నేరెడుకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. ప్రస్తుతం పండ్ల సీజన్ ప్రారంభమైనందున రోజుకు ఒకటి చొప్పున తిన్నా ఆరోగ్యానికి మేలు చేస్తుందని పలువురు నిపుణులు చెబుతున్నారు.

ఆరోగ్యపరంగా అనేక ప్రయోజనాలు

నేరేడు పండ్లలో ఐరన్, క్యాల్షియం, పొటాషియంతోపాటు ఏ, సీ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటితో వ్యాధి నిరోధకశక్తి పెరిగి సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ కలుగుతుంది. మూత్ర సమస్యల నియంత్రణతోపాటు మధుమేహం అదుపులో ఉంటుంది. అలాగే కిడ్నీలను శుభ్రపరుస్తుంది. ముత్రాశయంలో ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. కాలేయ పనితీరు మెరుగు పర్చడంతోపాటు శుభ్రపరుస్తుంది. నేరెడు పండ్లలో ఉండే యాంటీ ఆక్సిండెంట్లు గుండె, మెదడకు దివ్య ఔషధంగా పనిచేస్తాయి. దంతాలు, చిగుర్లు ఆరోగ్యంగా ఉంటాయి. చిగుర్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోటిలోని చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది. కడుపులో పేరుకుపోయిన మలినాలు బయటికి పోవడానికి, పేగుల్లో చుట్టుకుపోయిన వెంట్రుకలను కరిగించడానికి ఈ పండు ఎంతోగానో దోహదపడుతుంది. ఇవి శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారిస్తుంది. ఆరోగ్యానికి నేరెడు పండు భరోసా కల్పిస్తుంది.

నియంత్రణ లేకుంటే ఆరోగ్య సమస్యలు

నేరేడు పండు తినడంలో నియంత్రణ లేకుంటే దుష్ఫలితాలు సంభవించవచ్చు. వగరుగా ఉండి నాణ్యతలేని నేరెడు పండు తింటే గొంతు నొప్పి బారిన పడే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సీజన్ మారే సమయంలో ఈ పండ్లను మితంగా తినాలి. ఉబ్బసం ఉన్నవారు ఈ పండు ఎక్కువగా తినరాదు. దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంది. నేరేడు పండ్లలో ఉండే అత్యధిక లవణాలు, పోషకాల వల్ల బలహీనమైన జీర్ణ వ్యవస్థ కలిగిన వారికి తరచూ కడుపునొప్పి వచ్చే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

● మేఘమై నేను వచ్చాను



నగరం మేఘావృతమైంది. కాసేపు ఎండ.. కాసేపు నీలి మబ్బులు కమ్ముకోవడంతో నీడ దోబూచులాడాయి. కడప నగరంలో ఎక్కడ చూసినా ఇదే వాతావరణం కనిపించింది. నగర వాసులు ఈ దృశ్యాలు చూసి పులకించిపోయారు. వాటిని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

● తీగలు ప్రమాదం



కడప నగరంలోని బెల్లం మండీ వీధిలో అధికారుల నిర్లక్ష్యానికి సాక్ష్యం ఇది. విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండి తగులుతూ ప్రమాదంగా మారాయి. ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

ఇంటి స్థలాల ఆక్రమణకు అడ్డుకట్ట వేయాలి



పత్రాలను చూపుతున్న బాలకుమార్

కడప రూరల్: ఇంటి స్థలం ఆక్రమణకు అడ్డుకట్ట వేయాలని కడప నగరానికి చెందిన చెన్నూరు బాలకుమార్ తెలిపారు. విలేకరులతో కడపలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కడప శివానందపురంలో ఇంటి స్థలానికి సంబంధించి నిబంధనల ప్రకారం సర్వ హక్కులున్నాయన్నారు. ఇక్కడ ఉన్న ఇంటితోపాటు మొత్తం ఐదు సెంట్ల స్థలాన్ని అవ్వ పిచ్చమ్మ కటుంబ సభ్యుల నుంచి తన తండ్రి చెన్నూరు బాలగురవయ్య కొనుగోలు చేయడం ద్వారా తనకు సంక్రమించిందన్నారు. అక్కడ ఉన్న పాత ఇంటిని తొలగించి కొత్త ఇంటి నిర్మాణానికి ప్రయత్నిస్తుంటే కొందరు 2.50 సెంట్ల స్థలం ఇవ్వాలని బెదిరించారని అన్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సివిల్ కేస్ అని చెప్పారన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. కొండాసుబ్బయ్య, బాబు, మునెయ్య, బాలు తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా వేరుశనగ విత్తనశుద్ధి చేయాలి



వేరుశనగ విత్తనాన్ని రైతులకు అందజేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

వీరపునాయునిపల్లె : వేరుశనగ పంట సాగుచేసే ప్రతి రైతు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం మండలంలోని ఎస్.పాలగిరి రైతు సేవా కేంద్రంలో పంపిణీ చేస్తున్న విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. కిలో విత్తనానికి ఒక గ్రాము టెబ్యుకొనజోల్ లేదా 3 గ్రాములు మ్యాంకోజెబ్, ట్రైకొడెర్మావిరిడి పొడి మందుతో విత్తనశుద్ధి చేయాలన్నారు. కాండము కుళ్లు, వైరస్ తెగులు, వేరు పురుగు ఆశించే ప్రాంతాల్లో కిలో విత్తనానికి 2 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్, 600 ఎఫ్.ఎస్. 4 మి.లీ. నీళ్ల మిశ్రమంతో విత్తనశుద్ధి చేయాలన్నారు. కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ వేరుశనగ పంట సాగు చేసిన వెంటనే లేదా 1-2రోజుల లోపు ఎకరానికి 1 లీటరు పెండిమిథాలిన్ 30 శాతం ద్రావకం లేదా బ్యుటాక్లోర్ 50 శాతం ద్రావకం లేదా అలాక్లోర్ 50 శాతం ద్రావకంలో ఏదో ఒక దానిని 200 లీటర్ల నీటిలో కలిపి నేలపై పిచికారి చేయాలన్నారు. మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వేరుశనగ పంట సాగుకు వాతావరణం అనుకూలంగా ఉందని సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలన్నారు.

బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోండి



సమావేశంలో సూచనలిస్తున్న పోలీసు అధికారులు

కడప అర్బన్: కడప నగరంలో శాంతి భద్రతలకు భంగం కలుగకుండా బక్రీద్ పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలనిని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, కడప టూటౌన్ సీఐ బి.నాగార్జున కోరారు. కడప టూటౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు శాంతి కమిటీ సమావేశంలో డీఎస్పీ, సీఐ మత పెద్దలను ఉద్దేశించి సూచనలు చేశారు. వారు మాట్లాడుతూ ఎలాంటి మత ఘర్షణలు, మత విద్వేషాలకు పాల్పడకుండా సామరస్యంగా బక్రీద్ జరుపుకోవాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరియు కటిక(స్లాటర్స్) వారితో సమావేశం నిర్వహించి ఆవులు(గోవులు), దూడలు మాంసం కోసం వధించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఎవరైనా మాంసం విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కడప టూటౌన్ ఎస్ఐలు ఎస్‌కెఎం. హుసేన్, సిద్దయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంపై ప్రచారం అవసరం



కరపత్రాలు విడుదల చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ నాగరాజు, ఖాదర్‌బాషా, తదితరులు

కడప ఎడ్యుకేషన్: రక్తదానంపై ప్రచారం ఎంతో అవసరమని, తద్వారా యువత రక్తదానం చేసేందుకు ముందుకువస్తారని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సీనియర్ సభ్యులు అబ్దుల్ రాయల్ కరీముల్లా రూపొందించిన రక్తదాన కరపత్రాలను డీఎంఅండ్‌హెచ్‌ఓ తన కార్యాలయంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని సూచించారు. జనం కోసం క్రీడా సాంస్కృతిక విద్య అభివృద్ధి రాష్ట్ర అధ్యక్షుడు లయన్ పఠాన్ ఖాదర్‌బాషా మాట్లాడుతూ మనం చేసే రక్తదానం మరోకరికి ప్రాణదానం అవుతుందని అన్నారు. కరీముల్లా తమ సొంత ఖర్చులతో మూడేళ్లుగా రక్తదానంపై ప్రచారం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ అలవెన్స్ వెంటనే చెల్లించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న సిబ్బంది

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పెండింగ్ లో ఉన్న లెప్రసీ అలవెన్స్ తక్షణమే చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జీవో వెంటనే అమలు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్ పేర్కొన్నారు. నగరంలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సిబ్బంది స్థానిక మెడికల్ ఆఫీసర్లకు మంగళవారం వినతిపత్రాలు సమర్పించారు. వేణుగోపాల్‌మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా లెప్రసీ అలవెన్సు ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ, ఆశా కార్యకర్తలకు ఇవ్వకుండా ప్రభుత్వానికి వాపసు చేశామని అధికారులు తెలియజేయడం తగదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 62 ఏళ్ల పదవీ విరమణ వయస్సు, గ్రాట్యుటీ, మెటర్నిటీ సెలవులపై ఇంతవరకూ జీవో జారీ చేయలేదన్నారు. జీవోలు జారీ అయ్యేంతవరకు ఆశా కార్యకర్తలకు రిటైర్‌మెంట్ ఇవ్వవద్దని కోరారు. కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో శాంతమ్మ, నరసమ్మ, కుమారి సుజాత, రాజేశ్వరి, వెంకటసుబ్బమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

జూన్ 28న ఏఐఎస్‌బీ మహాసభలు



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలో జూన్ 28న నిర్వహించనున్న అఖిల భారత విద్యార్థి బ్లాక్(ఏ.ఐ.ఎస్.బి) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. కడప ఐటీఐ కళాశాలలో మహాసభ కరపత్రాలను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ఫీజు బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. విద్యార్థులకు ఏడాది పూర్తయినా తల్లికి వందనం ఇప్పటికీ విడుదల కాలేదని, హాస్టల్ విద్యార్థులకు మెస్ బిల్లులు విడుదల చేయకుండా, రెగ్యులర్ వార్డెన్‌లను నియమించకుండా ఇన్‌చార్జిలతో కాలం గడుపుతున్నారని ఆరోపించారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు అడ్మిషన్ ఫీజు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పేర్లతో రక రకాల ఫీజులు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు. విద్యార్థులను పోరాటాలకు సన్నద్ధం చేసేందుకు ఈ నెల 28న కడప నగరంలో నిర్వహించనున్న జిల్లా మహాసభ ను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిల్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు భద్రత



ఫోన్‌లో యాప్‌ను చూపిస్తున్న ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: శక్తి యాప్ సేవలు వినియోగించుకుంటే మహిళలకు పోలీసు భద్రత ఉంటుందని శక్తి టీమ్ మహిళా ఎస్ఐ శాంతమ్మ సూచించారు. కడప బిల్డింగ్ వద్ద శ్రీచైతన్య స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బందికి శక్తి యాప్‌పై మంగళవారం అవగాహన కల్పించించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించేందుకు శక్తి యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. యాప్‌సేవలు, రిజిస్ట్రేషన్ గురించి జిల్లాలో ప్రతి మహిళ, బాలికలకు, విద్యార్థులకు తాము అవగాహన కల్పిస్తున్నామన్నారు. బాలికలు సెల్‌ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వ్యక్తిగత వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఎస్‌ఓఎస్ బటన్, డయల్ 112 నెంబర్ ద్వారా ఫిర్యాదు చేస్తే పది నిమిషాల్లో మీ చెంతకు సంబంధిత పోలీస్ అధికారులు చేరుకొని సమస్య పరిష్కార దిశగా చర్యలు చేపడుతారని తెలిపారు. మహిళలు , చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాలపై డయల్ 100,112, చైల్డ్ లైన్ 1098, గృహ హింస 181, మహిళ వేధింపులు 1091,సైబర్ టోల్ ఫ్రీ 1930, సైబర్ మిత్రల ద్వారా పోలీసుసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ ఎం.శ్రీదేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం విజయవంతం చేయండి

కమలాపురం : ప్రజలకు హామీలిచ్చి వాటిని గాలికొదిలేసిన చంద్రబాబు చేసిన మోసాలు, అరాచకాలు, అన్యాయాలపై బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినంను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కన్వీనర్లు ఉత్తమారెడ్డి, గంగాధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ఏడాది జూన్ 4 తేదీన చంద్రబాబు సీఎంగా గద్దెనెక్కారని, అయితే ఏడాది కాలం గడిచిన పింఛన్ల పెంపు తప్పా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. సూపర్ సిక్స్ పేరుతో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర హామీలిచ్చి వాటిని పూర్తి స్థాయిలో విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా కష్టకాలంలో సైతం జగనన్న ఒక్క సంక్షేమ పథకం కూడా ఆపలేదన్నారు. వెన్నుపోటు పొడవడం చంద్రబాబు నైజం అని, అసలు వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని వారన్నారు. చంద్రబాబు చేసిన మోసాలకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టు నిరసన కార్యక్రమమే వెన్నుపోటు దినం అన్నారు. కమలాపురంలో ఉదయం 9.30 గంటలకు ఖాజీపేట రోడ్డులో ఉన్న ఫయాజ్ ఫిల్లింగ్ స్టేషన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నియోజకవర్గ స్థాయిలో నిరసన ర్యాలీ చేస్తున్నామని, ఈ ర్యాలీకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి హాజరు కానున్నారని వారన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరి

సిద్దవటం: ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఆశా వర్కర్‌లకు, ఏఎన్‌ఎంలకు మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ సూచించారు. సిద్దవటం మండలం లోని మాధవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ఆశాడే కార్యక్రమం జరిగింది. డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని, జాగ్రతగా ఉండాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

పత్తి సాగు వైపు.. రైతన్న చూపు



పత్తి పంటకు మందు స్ప్రే చేస్తున్న రైతు

వేముల: ఈ ఏడాది వేసవి పత్తి సాగుకు వర్షాలు సకాలంలో పడటంతో పత్తి పంట ఏపుగా పెరిగింది. ఈ ఏడాది పత్తి పంటను మార్చి నెల నుంచే రైతులు సాగు చేసుకున్నారు. సాగు సమయంలో అధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పటికి రైతులు సాగుకు మొగ్గు చూపారు. మార్చి నెలలో పత్తి సాగు చేసిన మొదలు ఏప్రిల్ చివరి వరకు ఆశించిన మేర వర్షాలు లేవు. ఆడపా దడపా కురిసిన వర్షాలు పంటకు సరిపోలేదు. అరకొర వర్షాలకు తోడు రైతులు సకాలంలో నీటితడులు అందించారు. వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో నాలుగైదు రోజులకు నీటి తడులు ఇవ్వడం ద్వారా పంటను కాపాడుకున్నారు. ముందుగా సాగు చేయడం ద్వారా దిగుబడులు ముందుగానే వస్తాయని ధరలు, ఆదాయం ఉంటుందనే ఆశతో రైతులు ముందుగానే సాగు చేసుకున్నారు.

వర్షాలతో గట్టెక్కిన వేసవి పత్తి సాగు

ఈ ఏడాది వేసవి పత్తి సాగుపై రైతులలో ఉన్న ఆందోళనకు వర్షాలు ఆశలు నింపాయి. సాగు సమయంలో ఉన్న ఎండలతో పత్తి పంట గిటకబారిపోయేది. అయితే సాగుకు ప్రకృతి అనుకూలించడంతో రైతుల ఆశలకు వర్షాలు ఆవిరిపోశాయి. ఏప్రిల్ నెలలో అరకొర వర్షాలు, మేనెలలో పదును వర్షాలు పత్తి పంటకు ఊరటనిస్తున్నాయి. తుపాన్ ప్రభావం, నైరుతి రుతుపవనాల ప్రభావంతో పదును వర్షాలతో పత్తి పంట ఏపుగా పెరిగింది. ప్రస్తుతం పంట పూత, పిందె, కాయ దశలో ఉంది. అంతేకాక అప్పుడప్పుడు వర్షాలు పడటంతో తెగుళ్ల కూడా పెద్దగా ఆశించలేదు.

పంటను ముందు జాగ్రత్తగా సస్యరక్షణ చర్యలు

వేసవి పత్తి పంటకు తెగుళ్ల సోకకుండా రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. సకాలంలో నీటి తడులు ఇవ్వడం, కూలీలతో కలుపు తీసివేయడం, సకాలంలో మందులు పిచికారి చేయడం ద్వారా పంట ఆశాజనకంగా కనిపిస్తోంది. పంటకు ఇప్పటికే రైతులు రెండు, మూడు సార్లు మందు స్ప్రే చేశారు. అలాగే పంటలో కలుపు లేకుండా జాగ్రత్త పడ్డారు. ముఖ్యంగా పత్తి పంటకు రసాయనిక ఎరువులను విత్తడం ద్వారా బాగా కనిపిస్తోంది. ఇప్పటికే పత్తి సాగు చేసి 70రోజులు కావస్తోంది. మరో నెల రోజుల్లో పత్తిలో దిగుబడులు చేతికి అందనున్నాయి.

ధరలు స్థిరంగా ఉంటే ఆదాయమే.. :

వేసవి పత్తి సాగులో రైతులలో ఆదాయం ఉంటుంది. అయితే మార్కెట్ ధరలు స్థిరంగా ఉండాలి. పత్తి దిగుబడులు, కొనుగోళ్ల ప్రారంభం నుంచే ధరలు స్థిరంగా ఉండాలి. అలా కాకుండా మార్కెట్ ధరలు హెచ్చుతగ్గులు ఉంటే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. గత ఏడాది క్వింటా పత్తి రూ.7300ల నుంచి రూ.8200ల వరకు ధరలు పలికాయి. అనంతరం ధరలు తగ్గడంతో ధరల కోసం చూసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది కూడా క్వింటా పత్తి రూ.8వేలకు తగ్గకుండా ఉంటే పత్తి సాగులో ఆదాయం ఉంటుందని రైతులు అంటున్నారు.

పత్తి సాగుపై ఆశలు పెట్టుకున్నాం.. :

ఈ ఏడాది పత్తి సాగుపై ఆశలు పెట్టుకున్నాం. నాకున్న 8ఎకరాలలో పత్తి సాగు చేశా. సాగు చేసి రెండు నెలలు కావస్తోంది. పంట పూత, పిందె, కాయ దశలో ఉంది. మరో నెల రోజులలో దిగుబడులు అందుతాయి. అప్పటిలోగా మార్కెట్ ధరలు ఉన్నట్లయితే ఆదాయం ఉంటుంది.



– చంద్రమోహన్‌రెడ్డి(పత్తి రైతు), గొందిపల్లె

సాగులో వేలకు వేలు పెట్టుబడులు..

వేసవి పత్తి సాగులో వేలకు వేలు పెట్టుబడులు అవుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, ధరలు పెరిగాయి. కూలీలకు కూలీ పెరిగింది. సాగులో అదనపు ఖర్చులు అవుతున్నాయి. తెగుళ్ల నివారణకు సకాలంలో మందులు పిచికారి చేస్తున్నాం. సాగులో దిగుబడులు పెరిగి ధరలు ఉంటే ఆదాయమే.



– రాఘవరెడ్డి(పత్తి రైతు), గొందిపల్లె